# నిను చూడగానే ఉషస్సు! నాలో కలిగెను తేజస్సు!

# అభయప్రదాత శ్రీ వేంకటేశా! శ్రీనివాసా!

## పద్మావతీ వల్లభా! ప్రముఖాంధ్ర రక్షకుడవీవే!



ఫాల్గుణ శుద్ధ ఏకాదశీ పునర్వసూ నక్షత్రయుక్తమైన సమయంలో నీ ప్రతిజ్ఞా పూర్వకపు వేదవాక్కుల్ని బ్రహ్మకుమారీలు వివరించారిలా!

**ఒక్కసారి నావైపు చూడు!**
*నిన్ను నా కంటిపాపలా చూసుకోకుంటే అడుగు!*
**ఒక్కసారి నన్ను నీ తోడు చేసుకుని చూడు!**
*నీ వెంట నీడనై రాకుంటే నన్నడుగు!*
**ఒక్కసారి నా సాన్నిధ్యానికి వచ్చి చూడు!**
*నా సర్వశక్తులు నీకు ధారపోయకుంటే అడుగు!!*
**ఒక్కసారి నా శ్రీ మతాన్ని పాటించి చూడు!**
*నిన్ను శ్రేష్టాతి శ్రేష్ఠముగా మలచకుంటే అడుగు!!*
**ఒక్కసారి నీ సమస్సలను నాతో చెప్పకుని చూడు!**
*నీ సమస్యకు నేను సమాధానం కాకుంటే అడుగు!!*
**ఒక్కసారి నా అడుగులో అడుగేసి చూడు!**
*అడుగడుగునా నీకు అండగా నేనుండకుంటే అడుగు!!*
**ఒక్కసారి నా సేవలో చిటికిన వేలందించి చూడు!**
*నీ అవసరానికి చిటికలో నీ ముందుండ కుంటే అడుగు!!*
**ఒక్కసారి నాపట్ల విశ్వాసపాత్రుడవై ఉండి చూడు!**
*నీ వెన్నంటి విజయం రాకుంటే నన్నడుగు!!*
**ఒక్కసారి నీలోని వ్యర్థానికి బిందువు పెట్టి చూడు!**
*నీ జీవితం వజ్రతుల్యం చేయకుంటే అడుగు!!*
**ఒక్కసారి మనఃపూర్వకంగా నన్ను తలచుకుని చూడు!**
*నీ మనోకామనలు తీర్చకుంటే అడుగు!!*



## విజయ నామ సంవత్సరానికి సగర్వంగా స్వాగతం పలుకుతూ సుఖశాంతులు కలుగాలని పద్మావతీ శ్రీనివాసుణ్ణి ప్రార్థిస్తున్నాం.

ప్రశ్న, అందుకు వాగ్దేవత వాగ్దానపూర్వక సమాధానం యిచ్చినట్టు స్వప్నం గన్నాను. ఆలోచనలూ, ఆచరణలూ నైతిక విలువలను కోల్పోవడం, నోరును అదుపులోనుంచుకోకపోవడం వలన మనం సర్వమూ కోల్పోతున్నాం. అసత్య, అవినీతులతో ఏర్పడిన సంబంధాలు మట్టిపై పునాదులు లేని భవనాల్లా కూలిపోతున్నాయ్! జగము మన చేతుల్లోనే నడుస్తుందని విర్రవీగుతున్నాం! నందన సంవత్సరం నవనందనంగా ఆనందం కలిగిస్తుందని భావించాం! అడియాసలపాలయ్యాం! వస్తూండే **విజయనామ సంవత్సరం** విజయాలను సిద్ధింపచేయాలంటే విజయములు ప్రసాదించు పరమాత్మునికే అంకితమనస్కులు కావాలి మనం.

**చేతులార శివుని పూజింపడేని**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడవడేని**
**దయయు సత్యంబు లోనుగా తలపడేని**
**కలుగనేటికి తల్లుల కడుపు చేటు**



# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఏప్రిల్ 2013

సంపుటి : 19 **220** సంచిక : 4




## వసుధైక కుటుంబ సంక్షేమాన్ని ఛేదించాలని విశ్వ మానవ నాయకులు వివిధ విధాలుగా వృధా కృషి చేస్తున్నారు!

### - వేదాలు పుట్టిన భూమి పురిటి నొప్పలకు గురికావడం వేదన కలిగిస్తూన్నది!-

యుద్ధ కౌరకంచుల్లో వేగివేగి వేసారి ఓడినవాడిలా భారతీయుడు కొట్టుమిట్టులాడుతున్నాడనే మాట అక్షఊాలా నిజమౌతూన్నది. అక్షరం పొడగిట్టకుండా అస్త్రంపై భారతీయుడు దృష్టిని సారించాడు. పుడమిలో అస్త్రాలను పెట్టి, అంతరిక్షంలో ఏ గ్రహాలున్నాయో అన్వేషణ కెగరడంతో ఏ లాభముందో ఎవరికి తెలియదు. వివేకానందుడైనా, ప్రభుపాదుడైనా భారతీయ ఔన్నత్యాన్ని ఆధ్యాత్మిక తత్వాన్ని విపులీకరించడానికే విదేశాలకు వెళ్ళారు. భారతదేశం 'రత్న గర్భ'యని చాటి చెప్పి వచ్చారు. ఆదిశంకర భగవత్పాదులు గానీ, రామానుజా చార్యులు వారు గానీ, మధ్వాచారులు వారుగానీ విదేశాలకేగలేదు. భారతీయుల్లో భక్తిభావన, ధర్మచింతన, సత్య సత్ప్రవర్తనల కోసమే దేశంలోనే సంచారం చేసారు. దేశం లోనే చతుర్విధ ధర్మాలూ, క్షాత్ర ధర్మ రక్షణమూ, భగవత్ సాన్నిధ్యంలో కల అనన్య మైన గ్రంథాల విశేష సారమును ఆసేతు హిమాచల పర్యంతం కల పౌరులెల్లరి మస్తకాల్లో హత్తుకుని పోయేట్లు చేసారు. రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి వంటి మహాయోగులు తమ స్థానాల నుండి కదలకుండా, విత్తానికి చిత్తాన్ని ఎరగాకుండా, సర్వ సౌజన్యత్వాన్ని విశ్వానికి చాటారు. భౌతిక భోగాలకూ, ఆడంబరాలకూ ఆస్కారం యివ్వలేదు. సర్వమూ జగన్మాతయేయని చాటి చెప్పిన మహన్మూర్తుల నిలయం భారతదేశం. విశ్వంలోని వారిని తమ వద్దకు వచ్చేట్లు చేసుకొన్నారే తక్క, వారున్న స్థానాల నుంచీ కదలలేదు. జనులను జాగ్రదావస్థల్లో, నీతి మార్గంలో నడిచేట్టు చేసారు. భగవాన్ అని గానీ, మహర్షులు యనిగానీ చాటుకోలేదు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థను చెదరనీయలేదు. తల్లిదండ్రులనే ప్రత్యక్ష దైవాలనీ, కలిసి ఉంటేనే కలిమి ఉంటుందనీ, చెలిమి చెలమలా ఊరుతుందనే భావాల్ని, వారి వారి మనసుల్లో ఊరేట్లు చేసారు.

మానవీయ సంబంధాలన్నీ రాజకీయ జోక్యంతో కలుషితమై, కుటుంబంలోని వారొక్కొక్క ద్వీపవాసులైనట్టుగా దూరంచేసారు. అమృతంకురిసే రాత్రుళ్ళ సుఖా స్వాదన యిప్పుడు లేదు. భద్రతను కోల్పోయాం, బాంధవ్యాలను కోల్పోయాం. ఇప్పటి ఈస్థితికి రాజకీయం ఒక కారణం. భక్తి వైవిధ్యాలొక కారణం. ఆదివారం నుంచీ శనివారం వరకూ, రోజుకొక వారం పేరున్నట్లు, కొత్త కొత్త రాజకీయ పక్షాలు పెరిగాయి. ప్రాంతీయ తత్వం పెరిగింది, స్వార్థం పెరిగింది. గురువులు పెరిగారు. తల్లిదండ్రులే తొలి గురువులనే సంగతి విస్మరించారు. వారిని ఆశ్రమాలకు తరమడం మాని, జీవించి ఉండగానే స్మశానాల్లో విడిచి వచ్చేస్తున్నారు.

**శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాములవారు శుక బ్రహ్మాశ్రమ స్థాపకులు, అపర గీతాచార్యులు, అపక్వాహార భుజితులూ, 'గీతామకరంద' యాజ్ఞికులు శత సంవత్సర జయంత్యుత్సవ సందర్భమున సహస్రాధిక వందనములు. వారిని స్మరించిన వారికి 'విజయ' వత్సరం విజయాలను ప్రసాదిస్తుందని మా విశ్వాసం!**

జన్మనిచ్చే స్త్రీని జగన్మాతగా కొలిచే భారత పౌరులు జన్మనీకుండా, జన్మనిచ్చిన మరుక్షణమో చెట్టూ చేమలూ, చెత్తకుప్పల్లో విసిరి పారేస్తున్నారు. వీటన్నిటినీ అధిగమించి పెరిగిన ఆడపిల్లలను నీతిమాలిన కామాంధులు అత్యాచారముల్జేసి హత్యలు చేస్తున్నారు; మరికొందరు వావివరుసలను మరిచి కామం తీర్చుకుంటున్నారు.

మను ధర్మశాస్త్రం ముందుగానే మేల్కొని, పురుషుడు ఎప్పుడూ ఒంటరిగా తల్లివద్ద గానీ, చెల్లివద్దగానీ, అక్కవద్దగానీ, వదిన వద్దగానీ, మరదలు వద్దగానీ, చివరకు అన్య స్త్రీ సమీపంలోగానీ, తనకు పుట్టిన ఆడపిల్లవద్దగానీ ఏకాంతంగా ఉండవద్దని శాసించినట్లు చెప్పింది.


ప్రస్తుతమదే మన సమాజంలో జరుగుతున్న అత్యాచార మూలకారణా లయ్యాయి. ఇందుకు స్త్రీ వేషధారణ కూడా కారణమవుతున్నది. సినిమాలు, టి.వి.లు కారణమౌతున్నాయ్.

దేఁవుడు వరమిస్తే పూజారి కాదన్నట్టు - గురువు ఆగ్రహిస్తే, దేఁవుడను గ్రహించడని ఓ నమ్మకం. ప్రజల్లో పాతుకునిపోయింది. తల్లీ, తండ్రులే ప్రథమ గురువులన్న సత్యం మరిచారు. అమ్మ 'ఆయ్' అని ముద్దపెడుతుంది. తండ్రి 'ఓమ్' అని అక్షఊాభ్యాసం చేయిస్తాడు. ద్విజులైతే ఉపనయనంలో తండ్రే గురువై కుమారుని చెవిలో గాయత్రీ మంత్రం బోధిస్తాడు.

గాయత్రీ మంత్ర స్రష్ట విశ్వామిత్రుడు బ్రాహ్మణుడేఁవీ కాదు. గాయత్రీ మంత్రం బ్రాహ్మణులకే పరిమితం కాదు. అందరికీ స్తవనీయమే!

వేదాలు పుట్టిన మన దేశ సంస్కృతి ఉమ్మడి కుటుంబాలకు పునాదులు వేసింది. విశ్వమంతా ఒక కుటుంబం (వసుధైక కుటుంబం)గా వరలాలన్న సహృదయత, సౌజన్యత, సఖ్యత, మానవుల మధ్య సరిసమానత పశు పక్షి వృక్షాదుల పట్ల ఆరాధనా భావం కల్గించినది భారతదేశమే.

**ఇండియాగా** పేరు పెట్టి దేశ భవిష్యత్తునూ అమ్మ వంటి 'గోవు'నూ కాదని పులిని జాతీయ జంతువుగా గుర్తించిన నాయకమణ్యులను ఏమనాలో అక్షఊాలు దొరకడం లేదు, దొరికిన అక్షఊాలను వ్రాయడానికి మనస్సు అంగీకరించడం లేదు.



'విజయ' నామ సం॥ములో సర్వజనులూ తప్పులను గ్రహించి, విజయాల్ను చేకొనాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

బుధజన విధేయుడు
*గోటేటి శ్రీరామారావు*


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# తెలుగు భాషోద్యమంలో తెలుగు సాంప్రదాయం తెలుగు వారి ఘనతను చాటిచెప్పాలి!

**1975** ఏప్రిల్ 12-18 తేదీల మధ్య హైదరాబాద్‌లో ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. ప్రపంచ తమిళ మహాసభల స్ఫూర్తితో మొదటి ప్రపంచ తెలుగు మహాసభ జరిగింది. ఊహించని దానికి మించి ఆ మహాసభలకు ప్రతినిధులు జనసంద్రంగా వచ్చి విజయవంతం చేసారు. మహాసభల్లో రోజుకి లక్ష మంది హాజరవటం ఆనాటి విశేషం. 16 దేశాల నుండి 92 మంది, ఇతర రాష్ట్రాల నుండి 981 మంది, మన రాష్ట్రం నుండి 4489 మంది ప్రతినిధులు హాజరయ్యారు. రోజుకి ఎనిమిది గంటల చొప్పున 28 అంశాల మీద సుదీర్ఘ చర్చలు జరిగాయి. పెక్కు పుస్తకాలు ప్రచురితమయ్యాయి. సామాన్య జనానికి, విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. పి.వి.నరసింహారావు, జలగం వెంగళరావు, వావిలాల గోపాలకృష్ణయ్య, మండలి వెంకట కృష్ణారావు వంటి వారు పాల్గొన్నారు. తెలుగుదనం ఉట్టిపడింది.

రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు 1981 ఏప్రిల్ 14-18 మధ్య కౌలాలంపూర్‌లో, మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు 1990 డిసెంబర్ 10-13 మధ్య మారిషస్‌లో జరిగాయి. మారిషియస్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్ని గూర్చి, చెప్పుకోదగ్గ గొప్పతనం లేదు. అక్కడివారు తెలుగు భాషను మరువకున్నప్పటికీనీ, సాహితీ కాణాచియైన చెన్నయ్ నుంచి తెలుగు భాషా సేవ చేస్తున్న వారిని పిలుద్దామనే ధ్యాస ఏదీ అక్కడివారికి కలుగలేదు. హైదరాబాదు నుంచీ వంది మాగదులే పెద్దలుగా వెళ్ళారు. ఆ సభల గురించీ ఎవరికీ అంతగా తెలియదు. ప్రపంచంలోని తెలుగు వారంతా గర్వపడేలా నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. తెలుగు భాషా, సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించే దిశగా, తెలుగుతనాన్ని చాటేవిధంగా రాష్ట్ర మంతటా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఊహించని జనం వచ్చినా, వారికి పుస్తకాలు యివ్వలేదు. ప్రత్యేక సంచిక లేదు. కొందరికి భోజనం లేదు.

ప్రపంచంలో తెలుగువారు ఎంతమంది ఉన్నారో ఎవరికీ తెలియదు. అలాంటి ప్రయత్నం చేయలేదు. అంతర్జాతీయ తెలుగు సంస్థ కాని, తెలుగు విశ్వవిద్యాలయంగాని, ఆ పనిచేసి ఉండవలసింది. పూర్తి సమాచారం సేకరించటం కష్టమే అయినా కృషిచేసి ఉండవలసింది. తెలుగు మహాసభల వల్ల తెలుగు వారు ఎందుకు గర్వపడాలి? ఎలా గర్వపడాలి? స్వభాషాభిమానం మంచిదేగాని, దురభిమానంగా మారటం అశాస్త్రీయం. అప్రజాస్వామికం. ప్రపంచ స్థాయిలో కొత్త ఆవిష్కరణలు చేసి, శాస్త్ర సాంకేతిక ప్రగతికీ, విశ్వ మానవ వికాసానికి దోహదం చేసిన తెలుగు వారి పేరెవరైనా తెలుసా? నోబెల్ బహుమానం పొందిన తెలుగువారెవరైనా ఉన్నారా? విదేశాల్లో స్థిరపడిన వారికి తెలుగు ప్రయోజనం ఏమిటి? ఈ ప్రశ్నలు స్వభాషాదురభిమానం లేనివారు లేవనెత్తేవి.

**తెలుగు దిన పత్రికలు విపరీతంగా ప్రచారం యిచ్చాయ్**

సాంప్రదాయపరంగా భాషను ఎప్పటికప్పుడు అధునీకరించటానికి ప్రయత్నించాలి. పరభాషా పదాలపై మోజును పెంచుకోవడం ఇచ్చగించరాదు. అవసరమైనప్పుడే వాటిని ఉపయోగించాలి. తెలుగు భాషా ఉన్నతి కోసం ప్రత్యేక పత్రిక అవసరమని **ప్రముఖాంధ్ర** గ్రహించింది. 'ఇంటర్‌నెట్' ద్వారా కూడా ప్రపంచంలోని తెలుగు వారందరూ 'ప్రముఖాంధ్ర'ను చదవగలుగుతున్నారు. ఇంటింట ప్రముఖాంధ్రను చదివేట్టు చేయాలని అకుంఠిత కృషి చేస్తూంది. రచనతోనే భాష సంపన్నమవుతుంది. మాతృభాషా సాంప్రదాయ సాహిత్యాలను నిలబెట్టుకోవడానికి చేసిన బృహత్‌యజ్ఞం పత్రికలు చేయాలి. "స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరము ప్రతిష్ఠాత్మక పత్రికలున్నా ప్రాచీన, ఆధునిక భాషా సాహిత్యాలను పరిపుష్టీకరించడంలో కృషి చేయడం లేదు. ఈనాడు భాషాభిమానులందరికీ వేదికగా నిలవాల్సిన బృహత్తర బాధ్యత ఉందని "తెలుగు వెలుగు"గా పత్రికను స్థాపించడంలో - **ప్రముఖాంధ్ర** ఒక కారక మార్గదర్శనం చేసిందన్నారు. మహాసభల లక్ష్యాలను కొంత పరిశీలిద్దాం. వైభవోపేతమైన తెలుగుజాతి భాష, సంస్కృతులపై బాలలకు, యువతరానికి అవగాహన కల్పించటానికి ప్రపంచ తెలుగు సమాఖ్య అవిరళ కృషి చేస్తూంది. తెలుగు భాష విశిష్టతపై, సంస్కృతిపై ఇప్పటికే తొమ్మిది మహాసభలు నిర్వహించింది. మద్రాసులో ఉంటున్నప్పటికీనీ దేశదేశాల్లోని తెలుగువారిలో మాతృభాష తెలుగుపై ఉత్సాహం ఉత్సుకత కలిగేట్టు చేసే కృషికి సమాఖ్య అధ్యక్షురాలైన వి.యల్. ఇందిరాదత్ ఆమె సహచరులే కారణం.

ఇతర రాష్ట్రాలలోనూ, విదేశాలలోనూ ఉంటున్న తెలుగువారిలో భావ సమైక్యాన్ని కలిగించకుండా అందరినీ ఒకే వేదిక మీద చేర్చటం అసంభవం. విదేశాల్లో ఉన్న తెలుగువారు ఎదుర్కొంటున్న సాధక బాధకాలు తాము ఉంటున్న భాషా సంస్కృతుల్లో మమైక్యం కాలేకపోవటం వలనే కొన్ని సమస్యలను కొందరు ఎదుర్కుంటున్నారు. తాము నివసిస్తున్న ప్రాంతాల సంస్కృతులతో కలిసిపోతూ, మాతృభాషను కాపాడడం విదేశీయులకు చాలా ముఖ్యమైన బాధ్యత. బోధనా భాషగా తెలుగు ఎంతో అభివృద్ధి చెందాలి. భారత, భాగవత, రామాయణాల మీద మక్కువ కలుగచేయాలి. కేవలం సాహిత్యం తోటే భాష పెరుగుదల కాదు, జరుగదు. ఆయా దేశాల్లోని తెలుగువారిని ఉత్తేజపరచాలి. ఈ విషయంగా వెబ్ ఎడిషన్లు ప్రయోజనమిస్తాయ్.

తెలుగు భాషణం మనం వాడుకునే రంగాలు అనేకం కావాలి. మన అవసరాల్లో మాతృభాష భాగస్వామ్యం పత్రికా రచనలు, లేఖా రచనలు, సాంప్రదాయ వ్యవహార విషయాలను మనం తెలుగులోనే చేయాలి. విస్తారమైన ప్రసార సాధనం ద్వారా కళా సాంస్కృతిక సామాజిక విజ్ఞానము, శాస్త్ర సాంకేతిక విజ్ఞానము అందరికీ తెలుగులో అందుబాటులోకి తీసుకుని రావాలి. ●




పి.వి. నరసింహారావు, జలగం, మండలి, వావిళ్ళ వంటి ఉద్ధండులు

భోగవంతునికి భిక్షునికి
అనుసంధానమైనది
అంబికా దర్బార్‌బత్తి
AMBICA DURBAR BATHI

# వర్గ, కుల, భాష, ప్రాంతాల వారీగా చీలిపోవడమేనా?

## భాషా వారీ రాష్ట్రాలతో మాండలిక భాషా రాష్ట్రాలుగా విడిపోతుంటే జాతీయ భావన మృగ్యమైపోయే ప్రమాదం ఉన్నదని గ్రహించండి!!

## ప్రజాస్వామ్య జాతీయ లక్షణాలు లేకపోతే భాష, ప్రాంతం విడివడితలతో ఛిన్నాభిన్నమవుతుంది.

**చూ**డగ చూడగ భాషా రాష్ట్ర విభజన జాతీయతకూ, జాతి సమగ్రతకూ గొడ్డలి పెట్టవుతుందని దేశ పెద్దల మదిలో ఆలోచన మొలకెత్తలేదు. విభిన్న భాషలూ ఏకతాభావం ఉన్న భారతదేశం ఉమ్మడి కుటుంబ సంస్కృతీ సంప్రదాయములు గల సాత్విక, సౌమ్య స్వభావ ఆధ్యాత్మిక సంపన్న దేశం. వృత్తులవారీ కుటుంబములున్నప్పటికినీ, మంచికీ, చెడుకూ, సుఖానికీ, దుఃఖానికీ అందరూ కలుసుకొనే అవసరతను కలిగిన సత్సాంప్రదాయం ఉండేది.

ఏ దేశమేగినా, ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా, యెవ్వరెదురయినా
పొగడరా, నీ తల్లి భూమి భారతిని!
నిలుపరా, నీ జాతి నిండు గౌరవం!
**- రాయప్రోలు**

చిన్న చిన్న గ్రామాల గ్రామరాజ్యంగా ఉన్న ఈ దేశం వ్యవసాయ ఫల దేశంగా, వర్ధిల్లింది. వ్యవసాయానికి పశు సంపద తోడు అవసరం కాబట్టి, 'పాడి' అభివృద్ధి చెందింది, ఒకరికొకరు తోడుగా ఉన్నట్లే – పశుపక్ష్యాదులూ, వాటితో వృక్ష సంపద. వాటి అసరాలకు తగిన నీటి సంపద, ప్రతి గ్రామమూ ఒక గోవింద బృందావనంలా ఉండేదన్న సత్యాన్ని **సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం, సస్యశ్యామలాం మాతరమ్ వందే మాతరమ్** – అని బంకించంద్ర ఛటర్జీ కీర్తించాడు. హ్యూని త్సాంగ్ వంటి చైనా యాత్రికుడు ప్రశంసించాడు. భారత స్వాతంత్ర్య సమరోద్యమంలో ఈ ఏకతాభావం నిర్దుష్టంగా కనిపించింది. భారత స్వాతంత్ర్య సాధనకు ప్రజా సమైక్యత మేలువరమైంది. సముజ్వల భారత సిరిసంపదలను, గ్రామ పాలననూ, ఆరాధనా భావనను, అతిథి గౌరవాలు, ఐశ్వర్యాలను చూచి ఎందరు సంతోషాంతరంగులయ్యారో, అంతమంది అసూయాంతరంగులూ ఉన్నారు. ఇప్పటి దేశంలో ప్రబలిపోయారు. వచ్చిన స్వాతంత్ర్య శుభ ఘడియల్లోనే, దుర్మూహూర్త ఘడియలు ప్రవేశించి దేశం రెండు భాగాలుగా విడిపోయింది. దేశ శిరోమణిగా, చంద్రికా చంద్రహాసంగా, నందనవనంగా ఉన్న కాశ్మీర్ కూడా రెండుగా చీలిపోయిందనడం కన్న భారతీయత అనే శీలం బీటలు వారిందని చెప్పుకోవాలి.

ఆంధ్రుడవై జన్మించితి
వాంధ్రుడవె యనుభవింపుమీ యుర్విభావం
భాంద్రుడవై మరణింపుమి
ఆంధ్రత్వం లేని బతుకు నాశింపకుమీ

దుర్మూహూర్త సమయమో, శుభముహూర్త సమయమో, ఏమోగాని, ఆయా మాతృభాషలు గల వారు స్వతంత్ర భాషా రాష్ట్రాలుగా ఏర్పడితే బాగుంటుందనే తత్త్వం కొందరి పెద్దల్లో చిగురించి భాషా రాష్ట్రోద్యమానికి దారితీయడం జరిగింది. అందుకు ఆజ్యం పోసి భాషా రాష్ట్ర రాజ్యం ఏర్పరచుకొన్నవారము మన తెలుగువారమే! ఏరీ కోరీ తెచ్చుకున్న ఈ భాషా రాష్ట్రంలో మూడు ప్రాంతాలవారు కలిసి ఉండాలని ఆనాటి పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. నైజాము కోరల్లో నలిగిపోతున్న తెలుగువారు, మాతృభాషాభిమానులు, ఎందరో మాన్యులైన కవులు తెలుగు తల్లికి సాహితీ నీరాజనం పట్టారు. తెలుగు మహాసభలు జరిపారు. రక్తాన్ని జుర్రిన రజాకారులకు ఎదురు తిరిగారు. వల్లభాయి పటేల్ పుణ్యమాయని నిజాము నుంచీ వారికి విముక్తి కలిగింది. బూర్గుల రామకృష్ణారావు ఆ ప్రాంతానికి ముఖ్యమంత్రిగా ఉంటూ, తెలుగు వారంతా ఒక్కటిగా ఉండాలనే భావంతో తన ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసి సీమాంధ్రులతో కలిసిపోయి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడడానికి దోహదమయ్యారు. ఒక ముఖ్యమంత్రి పదవిని వదులుకోవడం అంత తేలికైన విషయం కాదు, సురవరం ప్రతాపరెడ్డి గారు. ఆంధ్రుల సంస్కృతి, సాంఘిక కార్యకలాపాలనూ, ముస్లిముల రాచకోతలను కళ్ళకు గట్టినట్టు సత్యాలను సమీకరించి, ఆంధ్రుల సాంఘిక, సాంప్రదాయ చరిత్ర కళ్ళకు గట్టినట్టు గ్రంథ వివరణ చేసారు. ఆ గ్రంథం ఎంతోమంది ఆంధ్రులకు కనువిప్పు కల్గించింది. గోల్కొండ పత్రిక ద్వారా వారు సాహితీ రంగానికీ, పాలనాభ్యున్నతికీ దోహదకులయ్యారు. అలాటి గ్రంథం ఇంతవరకూ ఎవరూ వ్రాయలేదు. ఎన్ని ముద్రణలు జరిగిందో ఎవరూ చెప్పలేరు. కాళోజీ, దాశరధి, సి.నారాయణరెడ్డి వంటి ఎందరో కవులు తెలుగువారి పురిటి నొప్పులనూ, అహరహసేవలనూ, ఆంధ్ర ప్రాంతమంతా కలిసి ఉండాలని వారు పడిన తాపత్రయం అంకిత భావం వర్ణించజాలని సత్యం, అక్షరబద్ధం చేయలేము. మొత్తం తెలుగుజాతి వారికి ఋణపడి ఉంటుంది. ఎంతమంది తమ రక్తాన్ని చిందించి, తెలుగును కాపాడారో వివరించడమూ కష్టమే. అయితే నిజాం నవాబులందరూ ధూర్తులు కారు. తెలుగు భాషనూ, కవులనూ, కళలనూ పోషించారు. కూచిపూడిలో తానీషా ఒక రాత్రి మకాము వేసి కూచిపూడి నృత్యాన్ని తిలకించి, అగ్రహారాన్నే వ్రాసి యివ్వడం వలన కూచిపూడి నృత్యం అంతర్జాతీయ స్థాయికి వెళ్ళింది. భద్రాచల క్షేత్రంలో వాగ్గేయకారుడు రామదాసు విశ్వవిఖ్యాతి నొందారు. రామభక్తికి దాసుడై రామకళ్యాణానికి ముత్యాల తలంబ్రాలు పంపే సాంప్రదాయాన్ని తానీషా నెలకొల్పాడు. ఈ విషయాన్ని ఈనాటి ముస్లిములు గ్రహించడం ఎంతో అవసరం. ●

రాష్ట్ర సిద్ధి కోసం రక్తంబు గార్చిన
కవిని నేను గాంధీ కవిని నేను
బడలి బడలి తల్లి బాసకూడె మురియు
కవిని నేను, దేశ కవిని నేను.
**- తుమ్మల సీతారామమూర్తి చౌదరి**

భాష పుట్టె నరుని భావాలు ప్రకటింప
భాషతోనె నరుడు భాస్కరుండు
భాష కూడా ఒక్క బంధంబుగా మారె
విశ్వజనుల వాణి! వినర రంగ
**- దాశరథి రంగాచార్య**

లక్ష ముళ్లపొదల్ని భరించి
ఒక్క తోటై పెంచుకొందాం
లక్ష అపస్వరాల్ని సహించి
ఒక్క పాటైనా పాడుకొందాం.
**- భీమన్న**

We Provide your comfortable Stay and Tasty Food Hospitality
bd
Bhimas Deluxe Hotel
(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)
34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

# మాఘ మాసం నా మానసం పండే మాసం అన్నాడు భగవానుడు!



# వాగ్దేవి వరప్రసాద ప్రవాహం










# సంగీత సాహిత్య సమలంకృతే... స్వరరాగ పదయోగ సమపూజితే!

సాంస్కృతిక రాజధానిగా చెన్నై ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందింది. పెద్ద ఎత్తున సంగీతోత్సవాలు నిర్వహిస్తున్న ఏకైక నగరం చెన్నయ్యే. డిసెంబరు అడుగిడితే చాలు మార్గశీర్షం చకచకా గాన ధనుర్బాణాలను సంధిస్తూ వచ్చేస్తుంది. ఈ మాసాన్నే ధనుర్మాసమని మనం అంటాం. తమిళులు 'మార్గళి' అంటారు. 'మాసానాం మార్గశీర్షం' అంటూ ద్వాదశ మాసాల్లో మార్గశిరానికి ప్రత్యేక విశిష్టత ఉంది. ఈ మాసంలోనే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారికి సుప్రభాతం బదులు ఆండాళ్ రచించిన తిరుప్పావైతో మేలుకొలుపు కొలుపుతారు. సమశీతోష్ణస్థితిలో సంగీత, గాన, వాద్య సమరసం ప్రశాంతంగా పులకరిస్తుంది. నగరమంతా సంగీతోత్సవాలతో మైమరుస్తూ పులకించిపోతూంది. సర్వత్రా సరిగమల సందడి. సిరిమువ్వల సందడి. సిరిమువ్వల వాద్య సవ్వడి. నగరమంతా సంగీత వాద్యకారులతో నిండుగ పండుగ వాతావరణంతో శోభిల్లుతుంది.

**భారతీయ సంగీతం... భక్తి ప్రధానం**

ప్రపంచంలోని సంగీతాలన్నింట్లో భారతీయ శాస్త్రీయ సంగీతం మాత్రమే భక్తికి ప్రధానమిచ్చింది. మోక్షసాధనకు మార్గమని తుంబుర నారదులు సర్వదా నామజప సంకీర్తనంతో పునీతులయ్యారు. **అద్వైతసిద్ధికి, అమరత్వలబ్ధికి గానమే సోపానమని** ఎందరో మహనీయులు రుజువు చేశారు. ద్వాదశ ఆళ్వారులు రచించిన 'నాలాయిర దివ్య ప్రబంధం' గీత మాలికలు మోక్ష సాధనకు మూలికలు. 30 పాశురాలతో తిరుప్పావై రచించిన గోదాదేవి (ఆండాళ్), 'బ్రహ్మమొక్కటే' అంటూ 32 వేల కీర్తనలు రచించిన అన్నమాచార్యులు. 'సంగీత జ్ఞానము భక్తి వినా' అంటూ 24 వేల కృతులు రచించిన త్యాగరాజు మనకు మార్గదర్శకులు. సప్తస్వరాలు సుధారసగుళికలు. 1927లో అఖిల భారత సంగీత సదస్సు సందర్భంగా తొలిసారి ఏర్పాటైన సంగీతోత్సవాలు 'వటుడింతై ఇంతింతై' అన్నట్లు వటవృక్షంలా నగరమంతా సంగీతోత్సవాలు వ్యాప్తినొందాయ్. నగర సరిహద్దు క్రమేణా పెరుగుతున్నందున శివార్లలో కూడా సంగీత సభలు ఆవిర్భవించాయి. ఈ ఏడాది సంగీతోత్సవాలు నిర్వహిస్తున్న సంగీత సభల సంఖ్య దాదాపు రెండు శత సంవత్సర సంఖ్యకు చేరుకుంది.

పూర్వం రాజులు, సంస్థానాధీశులు, జమీందార్లు, సంగీతం, నాట్యంలాంటి సంప్రదాయ కళలను పోషించేవారు. ప్రస్తుతం చెన్నైలో సంగీత కళాపోషణ మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. సంగీతోత్సవాల్లో భాగంగా ఆయా రంగాల్లో నిష్ణాతులైన కళాకారులను అవార్డులతో సత్కరించే సంప్రదాయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బిరుదు పత్రాలు, బంగారు పతకాలు, నగదుతో ఘనంగా సత్కరిస్తున్నారు. అవార్డు గ్రహీతలకు బహూకరించే పతకాలను, నగదును కూడా విరాళంగా అందించేందుకు ప్రముఖ కళాపోషకులు పి.ఓబుల్ రెడ్డి కుటుంబ సభ్యులు, ప్రముఖ వ్యాపారులు డాక్టర్ నల్లి కుప్పుస్వామిచెట్టి శర్వాణి సంగీత సభ ప్రభృతులు స్వచ్ఛందంగా రావడం శుభ పరిణామం.

సంగీత ప్రియులను ఆకర్షించేందుకు సంగీత సభల నిర్వాహకులు కార్యక్రమాల రూపకల్పనలో, పరస్పరం పోటీ పడుతున్నట్టున్నాయి. ఇది కళాభిమానులకు వరప్రసాదంగా మారింది. రాగసుగంధాలు పరిమళించే సుస్వరాల బృందావనిగా సంగీత సభలు ఆహ్వానిస్తున్నాయి. డా॥ నల్లి కుప్పుస్వామిచెట్టి ఎక్కడ ఏఏ సభలు జరుగుతున్నాయో డైరెక్టరీ వేస్తున్నారు.

సంగీతం వినా – ముక్తిమార్గమున్నదయా! రాముడవో, రంగధాముడవో, శివుడవో, భవుడవో, సిరివో, శక్తివో, నను కట్టేసితివి కదయ్యా! నీవు వినా నాకెవ్వరు? కౌసల్యా వెంకటరమణ సుప్రజా రామా. తెరతీయ కదయ్యా – నాలోని మత్సరమను తెర తీయవయ్యా – అని త్యాగరాజు నుంచీ వాగ్గేయకారులందరూ భక్తిలో మునిగి కర్ణాభరణములుగా మూర్తీభవించిన కర్ణాటక సంగీత కృతులు. వాక్కును వాగ్దేవిగా, స్వరమును సామవేద సుధాసారంగా శరశ్చంద్ర చంద్రికా శీతల చందనా సౌగంధికమైన భక్తి మార్గము నెన్నుకున్న మన తెలుగు వాగ్గేయకారులు. రాగద్వేషాది నిర్మూలినీం, సర్వ స్వర రూపిణీం, మృదు మధుర భాషిణీం మంజుల భాసుర భారతి మంజూషే ప్రణతిః ప్రణుతిః అంటూ సంగీత వాగ్విభవ విమల వైభవ వాణితో సంగీత సరస్వతికి నీరాజనములు పట్టారు.

'రా' 'మ' అనే బీజాక్షర సంపుటిలో తారక మంత్రము స్ఫుటీకరింపబడింది. శ్వాస విడిచి తీసుకున్నప్పుడల్లా శాశ్వతానంద అనుభూతిని కల్గించే అనేక రాగాలు, కావేరీ అలలతో స్వర సల్లాపం చేసాయ్.

భక్తి రసానందపారవశ్యము చేత భవబంధభూతములే వదిలిపోవునట్లు భవ బంధ భూతములు వదిలినతోడనే మోక్షాభిమానము మొలకలెత్తు మోక్షాభిమానము మొలకలెత్తినంతనే జ్ఞానోదయ ప్రాప్తి కలుగు జ్ఞానోదయ ప్రాప్తి కలిగిన వెంటనే తన్ను మరిచి తంబుర మీటుచు తుంబర నారదుల కింపు సేయు అతడేనయ త్యాగయ్య, అతడేనయ్య అన్నమయ్య, అతడేనయ్య కృష్ణమయ్య, అతడె శ్యామశాస్త్రి, అతడేనయ దీక్షితుడు, అతడేనయ రామభక్తి దీక్షాపరుడైన రామదాసు, భక్తి, పరమార్థ, పరమానంద పుణ్యదాసులెల్లరు పట్టి వైచిన సంగీతమే మన కర్ణములను విలసింపచేసి కర్ణాటకమై విందులొనరిస్తుంది. సంగీతం ద్వారా మోక్షసిద్ధిని పొందిన వారిలో తెలుగువారే ఎక్కువ. కానీ ఆ సంగీతాన్ని ఆరాధించిన వారెక్కువగా తమిళులనే చెప్పుకోవాలి. త్యాగరాజు తెలుగువాడైనప్పటికినీ తమిళుల్లోనే ఎక్కువగా త్యాగరాజు నామాన్ని ధరించారు. నిజానికి వారు సంగీత విద్వాంసులు గాకపోయిననూ, ఆయన పేరుకు విలువ నిచ్చారు.

తెలుగులో కర్ణాటక సంగీతం వాడవాడలా ప్రాచుర్యం పొందింది. అనేక నగర, పట్టణ, పల్లెల్లో కూడా సంగీత సభలు జరుగుతున్నాయంటే దానికి ప్రత్యేక కారకుడు త్యాగరాజుల వారే. ఎక్కడెక్కడ ఏ సంగీత సభలు జరిగినప్పటికినీ ఏ భాషా సాంప్రదాయ సంగీత విద్వాంసుడైనప్పటికినీ త్యాగరాజ కృతిని పాడకుండా ఉండరనేది పరమ సత్యం.

త్యాగరాజ స్వామి జీవించి, సమాధి పొందిన తిరువాయూరులో ప్రసిద్ధ సంగీత విద్వాంసులందరూ తరతమ బేధాలను వీడి బహుళ పంచమీ రోజున –వారి సమాధి వద్ద త్యాగరాజ పంచరత్న సంకీర్తనలను భక్తితో ఆలపిస్తారు.

ఈ సమాధి నిర్మాణాన్ని కర్ణాటక వాసియైన త్యాగరాజు అంకిత భక్తురాలు బెంగుళూరు నాగరత్నమ్మ తన ఆస్తులన్నిటినీ విక్రయించిన ద్రవ్యంతో నిర్మించారు. తమిళనాడుకు చెందిన ప్రఖ్యాత కాంగ్రెసు నాయకుడూ, కామరాజ్ అనుచరుడైన జి.కె.మూపనార్ చిత్తశుద్ధితో–ఎక్కడెక్కడో ఉన్న మహ విద్వాంసులను రావించి, సామూహికంగా సంగీతారాధనాధ్వర్యం చేస్తూ వచ్చారు. తరువాత వారి కుమారుడు, కేంద్ర మంత్రియైన జి.కె.వాసన్ ఆ సాంప్రదాయం కొనసాగిస్తున్నారు.

జగదానందకారకా యనే త్యాగరాజకృతితో తెలుగు అక్షరబద్ధంగా ఆలపించడం ఆచారం. కున్నకుడి వైద్యనాథన్ (వాయులీన విద్వాంసుడు) ఈ పంచరత్న కృతుల ఆలాపనమును దక్షతతో మార్గదర్శనం చేస్తూ వచ్చారు. ఈ సంవత్సరం ఈ సభలను తమిళనాడు గవర్నరు శ్రీ రోశయ్య సమక్షంలో వైభవంగా జరిగాయ్. ●



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



## 83

## పదమూడవ అధ్యాయము - క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము

**ఈ** సత్యమును తెలసికొనినచో, అనగా తన దేహమందు దేహ సాక్షియైయున్న ప్రజ్ఞ పరమాత్మయే (ప్రజ్ఞానం బ్రహ్మ) అని ఎఱింగినచో ఇక జీవునకు అపరిమిత ధైర్యము, ఆనందము కలుగగలదు. ప్రపంచమున ఏ యితర విద్యచేగాని, జ్ఞానముచేగాని ఇట్టి మహాద్ధైర్యము జీవునకు కలుగనేరదు. కనుకనే అనేక జ్ఞానములు - సంగీతజ్ఞానము, శిల్పజ్ఞానము, రాజకీయ జ్ఞానము మున్నగునవి లోకమున నున్నప్పటికిని అన్ని జ్ఞానములలోను క్షేత్రక్షేత్రజ్ఞ విభాగసంబంధమగు జ్ఞానమే నిజమైన జ్ఞానమని భగవానుడిచట తెలియజేసిరి. ఇంతియే కాదు 'మమ మతమ్' - ఇది నానిశ్చితాభిప్రాయము - అని చెప్పుటవలన ఈ వాక్యము యొక్క పరమ సత్యత్వమును వ్యక్తపఱచినట్లైనది. కాబట్టి సాధకలోకమిట్టి భగన్ముఖారవింద సంజనిత ప్రతిజ్ఞాపూర్వక వచనములంద పరిమిత విశ్వాసము కలదై, అట్టి క్షేత్రక్షేత్రజ్ఞ విభాగజ్ఞానమును, దృగ్దృశ్యవివేకమును తక్కిన విద్యలకంటె ముందుగా తప్పక సంపాదించి తనలోనే సర్వలోకాధీశ్వరుని ఉనికిని అనుభూత మొనర్చుకొని, జన్మను కడతేర్చుకొనవలెను.

మఱియు సమస్త క్షేత్రములందును తాను క్షేత్రజ్ఞుడనని చెప్పుటవలన, శ్రీకృష్ణమూర్తి కేవలము మానవమాత్రుడు కాదనియు, సర్వభూతములందు అధిష్ఠాన రూపుడుగ వెలయుచున్న పరమాత్మయే యనియు స్పష్టమగుచున్నది. ఇంకను 'సర్వ క్షేత్రము' అని పేర్కొనుటవలన, ఏ ఒకానొక ప్రాణియందో, జాతియందో, వర్ణమందోకాక, సమస్త ప్రాణికోట్లయందు, బ్రాహ్మణునియందు, చండాలునియందు క్రిమికీటకాదులందు సర్వత్ర సత్తాసామాన్యరూపమున పరమాత్మ వసించుచున్నారని విశదమగుచున్నది. 'క్షేత్రజ్ఞమ్' అని చెప్పుటవలన, పరమాత్మ ప్రజ్ఞారూపుడే కాని జడ రూపుడుగాని, శూన్యరూపుడుగాని కాదని అర్థమగుచున్నది.

**4. తత్క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్**
**స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు.**

**వ్యాఖ్య:** భగవానుడు తాను చెప్పబోవు వాక్యములన్నిటియొక్క సారమును ఇచట ప్రారంభముననే సూచించిరి. ఎట్లనిన - క్షేత్రమును వికారవంతముగను (యద్వికారి) క్షేత్రజ్ఞుని ప్రభావశీలునిగను (యత్ప్రభావశ్చ) వర్ణించిరి. వాస్తవముగ దేహాదిరూపమగు ఉపాధి పెక్కు వికారములతో గూడి నశ్వరమైనదియు, ఆత్మ శాశ్వతమై, అమిత ప్రతిభావంతమై వెలయుచున్నదియు నగును.



**'ఆత్మ సంస్థం మనఃకృత్వాన కించదపి చిన్తయేత్'**
**- మనసును బాహ్యము నుంచి, అంతర్ముఖ మొనర్చి, ఆత్మేతరములను చింతింపరాదన్న గీతాచార్యుల ఆదేశమును అక్షరాలా ఆచరణలోపెట్టిన మహాజ్ఞాని, తపస్విబ్రహ్మీభూతులైన శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వామి వారి శత జయంత్యుత్సవములు ఏప్రిల్ 28 నుంచీ 5 రోజుల పాటు వైభవంగా జరుపబూనడం అస్మదాదులకు ఆనంద పరమానందకందితం. ఈ మహోత్సవ రధసారధి శ్రీశ్రీ విద్యాస్వరూపానంద గిరిస్వామి, వారి శిష్యగణానికి మా వందనములు. -ప్రముఖాంధ్ర**

'సమాసేన మే శృణు' - ఈ విచారణనంతను సంక్షేపముగ చెప్పెదనని భగవానుడు పలికిరి. ఏలయనిన, ఈ దృగ్దృశ్యపదార్థ విచారణయంతయు ఒక పెద్ద గ్రంథము. యుద్ధ సమయము కావున దానినంతను చెప్పుటకు అనుకూలము లేదు. కాబట్టి సంగ్రహముగ చెప్పదలంచిరి.

**5. ఋషిభిర్బహుధా గీతం ఛన్దోభిర్వివిధైః పృథక్**
**బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః**

**వ్యాఖ్య:** తాను చెప్పదలంచుచున్న క్షేత్రక్షేత్రజ్ఞ జ్ఞానము యొక్క మహిమను తెలుపుటకై భగవానుడు అనుభవజ్ఞులగు పరమఋషుల వాక్యములను తార్కాణముగ జూపుచున్నాడు-

'ఋషిభిర్బహుధాగీతామ్' - ఋషులనగా ఇంద్రియములను జయించినవారు. ఆత్మ సాక్షాత్కరమునొందిన మహనీయులు. అట్టివారు దేనినైనను చెప్పినచో దానిలో ఎంతయో సారము, మహిమ, గొప్పతనము తప్పక ఉండియుండును. అట్టి ఋషులు ఒకసారి కాదు, అనేకసార్లు - 'బహుధా' పలువిధములుగ ఆ జ్ఞానమును గూర్కి చెప్పిరని వచించుటచే దానికి ఎంతయో ఆధిక్యత గలదని స్పష్టమగుచున్నది.


'హేతుమద్భిర్వినిశ్చితైః' - ఆ వ్యాసాది మహర్షులు పలికిన బ్రహ్మసూత్రాది బ్రహ్మప్రతిపాదిక వాక్యములు సామాన్యములు కావు. హేతువాదము యొక్క పరీక్షకు నిలుచునవి, సహేతుకములైనవి. స్వానుభవముచే లెస్సగ నిశ్చయింపబడినవి కనుకనే 'నిశ్చితైః' అని చెప్పక 'వినిశ్చితైః' (బాగుగ నిశ్చయింపబడినవి) అని చెప్పిరి. పరమసత్యములని భావము. కాబట్టి శ్రీకృష్ణపరమాత్మ చెప్పబోవు ఈ క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ జ్ఞానము ఎంత గొప్పదో, దానిపై జనుల కెంతటి విశ్వాసముండవలెనో పై భగవద్వార్యముల వలన స్పష్టమగుచున్నది.

**6. మహాభూతాన్యహఙ్కారో బుద్ధిరవ్యక్తమేవ చ**
**ఇన్ద్రియాణి దశైకం చ పఞ్చ చేన్ద్రియగోచరాః**

**7. ఇచ్ఛాద్వేషస్సుఖం దుఃఖం సఙ్ఘాతశ్చేతనా ధృతిః**
**ఏతత్క్షేత్రంసమాసేన సవికార ముదాహృతమ్.**

**వ్యాఖ్య:** క్షేత్రమనగా కేవలమొక స్థూలదేహమే కాదు. సమస్త దృశ్యమున్ను క్షేత్రమే. స్థూల సూక్ష్మ పంచమహాభూతములు, మనస్సు, బుద్ధి, అతి సూక్ష్మమగు అవ్యక్తము (మూలప్రకృతి) కూడ క్షేత్రము క్రిందకే లెక్కకు వచ్చును. మనస్సు, బుద్ధి కూడ క్షేత్రమునకు చెందినవే కావున వాని వృత్తులగు ద్వేషాది దుర్వృత్తులు, ధృత్యాది సద్వృత్తులు కూడ క్షేత్రము క్రిందనే లెక్కవేయబడినవి. దృశ్యరహిత నిస్సంకల్పాత్మస్థితి యందు ఆ ధైర్యాధిసద్వృత్తులనుగూడ దాటిపోవలసియుండును.

*(తరువాయి వచ్చే సంచికలో)*



# న్యూ ఆర్కుని సన్నిధిలో స(తీ)త్యవతి సమేతుణ్ణాయి...

'ఆత్మనః ఆకాశః సంభూతః' అంది వేదం. పరమాత్మ నుండే ఆకాశం ఉద్భవించింది. ఏఁవీ తోచనప్పుడు, ఏదీ తీరని ఆవేదన కలిగినప్పుడు ఆకాశం వైపు చూడడం అందుకేనేమో!

**పొందనేర్తునె నిన్ను పూర్వజన్మ సుకృత విభవమున నను చెంత చేరితివి! సలలిత కపోల నీ మృది సూక్తిలోన మురిసి దశాబ్దము దాటిపోయే!** – శ్రీ గౌరీశ్వర సాన్నిహిత్యమని మురిసి విరిసిన విరజాజులైన భావసుగంధాల నెవ్వడో ప్రపంచవాణిజ్య భవనము (World Trade Centre) ను కూల్చేసినట్టు స(తీ)త్యవతీ బంధం కూల్చివేసె కదమ్మ! అందుకే 'న్యూయార్కు' వెళ్లినప్పుడు ప్రపంచ వాణిజ్య శ్రేణీ భవనమునకు లిబర్టీ స్టాట్యూ వైపునకో వెళ్ళను, టైమ్ స్క్వేర్ వద్ద విశాలంగా వ్యాపించుకున్న భూశ్రేణీ లక్ష్మిని ఆరోహణ అవరోహణా క్రమంలో చూచి జీవితంలోని ఎత్తుపల్లాలనొకసారి తలచుకుంటాను. న్యూ ఆర్కుడు (న్యూయార్కుడు) సూర్యుణ్ణైనా దర్శిస్తాను. లేదా సాయం సమయంలో ఎర్రటి కుందనపు బింబంలా హడ్సన్ నదిలోకి దిగిపోతూన్నట్టున్న న్యూ ఆర్కుణ్ణి చూస్తాను.


ప్రపంచ వాణిజ్య యుగళభవనము రెండు అవి రెండూ రాజఠీవిలో ఉన్నప్పుడు – నా మూడవ కుమార్డు నాగసాయీ ప్రసాద్, కోడలు సుప్రీత, మనుమరాలు అంజన మా దంపతులతో ఉన్న ఫోటోను చూస్తున్నప్పుడు దశాబ్దంన్నర గతంలోకి జీవితం వెళ్ళిపోతుంది. కడలి తరంగాలలోనైనా అప్పటి చిత్ర ప్రతిబింబము కనపడుతుందేమోనని భ్రమపడతాను. కడలి కదా అది. కన్నీటి కడలిని కలచివేస్తుంది. ఎన్నో సంవత్సరాల నిధులను దాచుకున్నట్టు అలనాటి తరంగాలలో, ఆమె – నేనూ ఉన్నామేమోనన్న దాగివున్న ప్రతిబింబం ఏమైనా బయటపెడుతుందోనని, అమెరికా వెళ్ళినప్పుడల్లా మనహట్టన్ (న్యూయార్కు) వెడదామనే కోరికను వెలిబుచ్చుతాను. భ్రమ వెర్రిది కావున. వేపగింజంత వెర్రి ఎంతటివాడికైనా రాకుండా ఉండదే! కిష్కిందలో సుగ్రీవాదులు సీతమ్మవారి నగల మూట విప్పి చూపినప్పుడు ఆయనకలాటి భావనే కలిగిందన్నాడు వాల్మీకి. ఆ రామునికే అలాంటి బాధ భావం కలిగినప్పుడు ఈ రాముని ఆరామ సమయాల్లో భావన రావడం సహజమే కదా!

ఆమె నా సతీ (సత్య)వతి కడలి తీరపు దీపంగానైనా కనిపించదు – అనుకున్నప్పుడు, నేను సంసారం తీరం నుంచీ జాడ తెలియకపోయినా జా(ణ)డను, సముద్ర పడవలో చుక్కాని పాదాల కంపనలో గురియైన అడుగింటిన కెరటాలు పైకి వచ్చినప్పుడు కడలి కెరటం కడుపులో దాచుకున్న, అలనాటి చిత్రబింబం కనిపించనగును కదా. సంగమ సాఫల్యమందించిన నదీ సుందరి ప్రతిబింబిస్తుందని విశ్వాసం తెచ్చుకుంటాను.

ఆలుమగలు ఆకాశం, భూమి అంటారు. వారి దాంపత్యం వాగర్థ ప్రణయైక మత్యమంత ఆదర్శవంతమైందంటారు. అర్ధనారీశ్వర తత్వం అంటే అదే. పెళ్ళినాటి సప్తపదిలో ముందు నాలుగడుగులు వధువు వరుణ్ణి నడిపిస్తే, మిగిలిన మూడడుగులూ వరుడు వధువును నడిపిస్తాడు. ఆ నడక తడబడకుండా అన్యోన్యంగా అజరామంగా నడిచే విధానం ఒక్క భారతదేశంలోనే ఉంది. ఈ ఆదర్శ విధానాన్ని తమ దేశంలో కూడా పటిష్టపరచాలని, మూడు ముళ్ళు పడిన శాఖ వారు గ్రహించి, ఏడు సంవత్సరాలు భద్రపరిచి తరువాత ఆ దంపతులకు పంపుతారట. అప్పటికి వారు విడిపోకున్నారా, వారి అన్యోన్యత మరింత పటిష్టపడి, చివరి శ్వాస వరకూ కాపురం చేస్తారు. విడిపోయి ఉన్నారా – ఆ దంపతులకది చెంపదెబ్బయవుతుంది.

**స(తీ)త్యవతీ బంధం!**

పానకంలో పుడకలా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే భారతీయ దాంపత్య అనుబంధం చాలా పవిత్రమైనది. వాల్మీకి ఊర్మిళాదేవి నిద్రలో అన్యోన్య దాంపత్య పటిష్టతను, పవిత్రతనూ ఘనంగా విశదీకరించాడు. ఆలుమగల మధ్య దాంపత్యానుబంధం క్రమేణా కాలం గడిచేకొలది ఎడతెగని స్నేహబంధంగా మారాలి. అప్పుడే ఆ సంసారం సరస సుధారససారం. ఆ జంట లోకం కనులపంట అన్నాడు 'ఉత్తర రామచరిత్ర'లో భవభూతి.




వరల్డ్ ట్రేడ్ సెంటర్ దర్శించిన మా దంపతులతో కుమారుడు సాయిప్రసాద్, కోడలు సుప్రీత, మనుమరాలు అంజన

ఒకప్పటి అమెరికా రాజధాని... నా గుండెల తలుపు తట్టిన హృదయ ధుని... ఇప్పుడు ప్రపంచ ఆర్థిక కేంద్రం... అత్యధిక భాషలకు ఆవాసం... 'క్రాస్ రోడ్స్ ఆఫ్ ద వరల్డ్' ఈ న్యూ–అర్కనగరం... అమెరికా స్వాతంత్ర్య చిహ్నానికి స్థావరం...

న్యూయార్క్ నగరంలో చీకటి అనేది లేదు. రాత్రీ పగళ్ళు అనేవి లేవు. తలెత్తకుండా నగరాన్ని చూడలేము. తలదించి నడవలేము. నగరం దీవుల సమూహం... కాబట్టి వాటిని కలుపుతూ బ్రిడ్జిలు ఉంటాయి. హడ్సన్ నది పాయలుగా చీలి అట్లాంటిక్ మహాసముద్రంలో కలుస్తుంది. నదీ పాయల మధ్య ఉన్న భూభాగాలే ఈ దీవులు. వాటిలో మన్‌హాటన్, స్టాటెన్, లాంగ్ ఐలాండ్‌లు ప్రధానమైనవి. చిన్న పెద్ద కలిసి ముప్ఫైకి పైగా దీవులు ఉన్నాయి. మన్‌హాటన్ దీవి ఆర్థిక లావాదేవీల కేంద్రం. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఇక్కడే ఉంది. ఐక్యరాజ్య సమితి భవనం ఇక్కడే ఉన్నది. మన్‌హాటన్‌లో జీవితం చాలా ఖరీదైనది, పీక్ అవర్స్‌లో విపరీతంగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. 30 మైళ్ల దూరం వెళ్లడానికి రెండు – రెండున్నర గంటలు పడుతుంది. వాహనాన్ని సులభంగా నడపాలంటే రాత్రి 11 నుంచి ఉదయం ఐదు లోపే సాధ్యం. ఎవరైనా మన్ హాటన్‌లో నివాసం ఉండేవారు. రోడ్డుమీద ప్రయాణించరు. హెలికాప్టర్‌లో వెళ్లాల్సిందే. వాళ్లకు అపార్ట్‌మెంట్ టెర్రస్ మీద హెలీపాడ్ ఉంటుంది.

సామాన్యులు మన్‌హాటన్‌లో నివసించాలంటే... 10 బై 10 గదిని ఐదుగురు పంచుకోవాలి. అదే ఖర్చుకు ఇక్కడకు దాదాపు 35 మైళ్ల దూరంలో ఉన్న ల్యాంగ్ ఐలాండ్‌లో డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ వస్తుంది. ఇండియన్స్ ఎక్కువగా అక్కడ ఉంటారు. లేదా న్యూజెర్సీలో ఉండి రైల్లో, ట్యాక్సీల్లో వచ్చేవాళ్లు కూడా ఎక్కువే. కానీ వాళ్లు డ్రైవ్ చేయరు. జర్నీలో పుస్తకం చదువుకుంటూ, ల్యాప్‌టాప్‌లో పనిచేసుకుంటూ ప్రయాణించేవాళ్లే ఉంటారు. ఇక్కడ రైలు మార్గం విస్తృతంగా ఉంది. కానీ ట్రైన్ జర్నీ అన్ని సందర్భాల్లో క్షేమం కాదు. ముఖ్యంగా రాత్రి పది తర్వాత రైలు ఎక్కకపోవడమే మంచిది. ఇక్కడ రాత్రి ఒంటి గంటకు రైల్వే స్టేషన్‌కు పోలీసులు తాళం వేసి, ఉదయం ఐదు – ఆరు గంటల మధ్య తీస్తారు.

క్వీన్స్‌ల్యాండ్ దీవి మన్‌హాటన్‌కు కొంచెం దూరం. ఇక్కడ ఆసియా వాసులు ఎక్కువ. జాక్సన్ హైట్స్ ప్రదేశం అయితే పూర్తిగా భారతదేశం అనే చెప్పాలి. భారతీయులకు అవసరమయ్యే వస్తువులన్నీ దొరుకుతాయి. ఆలయాలు, రెస్టారెంట్లు, ఆఖరుకు సెలూన్లు కూడా. ఇక్కడ రోడ్లలో తిరుగుతుంటే ఇండియాలో ఉన్నట్లే అనిపిస్తుంది. దుకాణాల పేర్లు కూడా 'పటేల్ బ్రదర్స్, రాజా ఫుడ్స్... ఇలా మన పేర్లే ఉంటాయి. మనకు రిలయన్స్ లాగ ఇక్కడ ఇవి గొలుసు షాపులు దాదాపు రెండు వందలకు పైగా శాఖలు ఉంటాయి.

## వందేళ్ల వారధులు...

న్యూయార్క్ నగరంలోని బ్రిడ్జిలను న్యూయార్క్ అండ్ న్యూ జెర్సీ ట్రస్ట్ అథారిటీ నిర్వహిస్తుంది. ఇవన్నీ దాదాపు వందేళ్ల క్రితం కట్టినవి. రద్దీ ఎక్కువ కావడంతో ఇప్పుడు అవి సరిపోవడం లేదు. కొత్త లేన్‌లు వేయాలి. వాహనదారుల నుంచి వసూలు చేసే టోల్ ఫీ ఎక్కువగానే ఉంటుంది. బయట నుంచి న్యూయార్క్ సిటీలోకి ప్రవేశించి మన్‌హాటన్ చేరాలంటే దాదాపుగా 16 డాలర్లు చెల్లించాలి. ఈ డబ్బంతా బ్రిడ్జిల నిర్వహణకు, చిన్న మరమ్మతులకే సరిపోతోంది!

## అందరూ సాయుధులే!

మనకు ఆయుధాల వాడకం నిషేధం. తుపాకీ వాడాలంటే శాంతిభద్రతలు, రక్షణ, సంబంధిత వ్యవస్థలకు చెందిన వారు అయి ఉండాలి లేదా ప్రత్యేక కారణాలతో అనుమతి పొంది ఉండాలి. ఇక్కడ ఎవరైనా సరే తుపాకీ కొనుక్కోవచ్చు, వాడవచ్చు. మాల్స్‌లో నిత్యావసర వస్తువులతో పాటు తుపాకీలు ఉంటాయి. అమెరికా వాళ్లు రాజ్యాంగాన్ని అలా సవరించుకున్నారు. బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొందిన తర్వాత 'ప్రతి పౌరుడూ ఒక సైనికుడు కావాలి' అన్న ఉద్దేశంతో రాజ్యాంగ సవరణ జరిగింది. అది అనేక నేరాలకు హేతువు అవుతోంది. ఈ సంస్కృతి అమెరికా అంతా ఉన్నప్పటికీ న్యూయార్క్ నగరంలో ముఖ్యంగా హారెమ్ వంటి ప్రదేశాల్లో కొందరు గుంపులుగా ఎక్కువ నేరాలకు పాల్పడుతుంటారు.

ఇక్కడ ప్రభుత్వ, పాఠశాలల్లో పన్నెండవ తరగతి వరకు ఉచిత విద్య లభిస్తుంది. ఆతర్వాత పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసుకుంటూ, చదువుకునేవారుంటారు. ప్రభుత్వ పాఠశాలలు మన ప్రభుత్వ పాఠశాలలు కన్నా చాలా బాగుంటాయి. నేర సంస్కృతి ప్రభావం స్కూల్‌లో కూడా కనిపిస్తుంది. ప్రైవేట్ స్కూళ్లు కూడా ఉంటాయి. కానీ వాటిలో ఫీజు చాలా ఎక్కువ. దాదాపుగా నెలకు పదివేల డాలర్లు కల సరిసంపన్నులు మాత్రమే చదివించగలరు.

## ల్యాండ్ మార్కులకు ల్యాండ్ మార్క్!



- నగరంలో లెక్కలేనన్ని ల్యాండ్ మార్క్లు ఉన్నాయి. దేశానికి చిహ్నమైన స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ న్యూయార్కులోని లిబర్టీ ఐలాండ్‌లో ఉంది. ఇది అమెరికా స్వాతంత్ర్యానికి చిహ్నం.
- బ్రాడ్‌వే థియేటర్ డిస్ట్రిక్ట్... పాదచారులతో రద్దీగా ఉంటుంది. ఎంపైర్ స్టేట్ బిల్డింగ్, అమెరిక మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ, మెట్రోపాలిటన్ మ్యూజియం...ప్రధానమైనవి.
- న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రపంచంలో అతి పెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్. ఇక్కడ భూమి ధర ప్రపంచంలోనే అత్యధికం. గుర్రపు టాంగాలూ, రెండంతస్తుల బస్సులూ సెకను సెకనుకూ తిరుగుతూనే ఉంటాయి.
- క్వీన్స్ ఐలాండ్‌లో జాన్ ఎఫ్ కెన్నడీ ఎయిర్ పోర్టులో విమానం ఎక్కడం దిగడమే కాదు చూడడం కూడా గ్రేట్ ఎక్స్‌పీరియెన్స్. 25 సెకన్లకు ఒక విమానం గాల్లోకి లేస్తుంది. టేకాఫ్ అయ్యే విమానాలు, ల్యాండ్ అయ్యే విమానాలతో చూపు తిప్పుకోలేం. ఇంతటి రద్దీ ట్రాఫిక్ ఉన్న ఎయిర్‌పోర్టు ఇది. అంత రద్దీలోనూ రన్‌వే ట్రబుల్స్ కానీ ఇతన ఏ ఇబ్బందులూ కూడా ఉండవు.
- టైమ్‌స్క్వేర్‌ను క్రాస్‌రోడ్స్ ఆఫ్ ద వరల్డ్ అంటారు. ఇక్కడికి ఏటా 5 కోట్ల మంది వస్తారు. వరల్డు ట్రేడ్ సెంటర్ కూల్చిన తరువాత అక్కడి శోభే పోయింది.

- న్యూయార్క్ నగరంలో ద బ్రాంక్స్, బ్రూక్లిన్, మన్‌హాటన్, క్వీన్స్‌లాండ్, స్టాటెన్‌లాండ్... ఈ ఐదు దీవులు ప్రధానమైనవి. ఈ భారీ వంతెనలూ హడ్సన్ నదిలో ఉన్న టన్నలులో ప్రయాణం, సరదా, సరాదాగా ఉంటుంది.
- యునైటెడ్ స్టేట్స్‌లో ఎక్కువ జనసాంద్రత కలిగిన పెద్ద నగరం. ఇక్కడ 800 భాషలు మాట్లాడే వాళ్లు నివసిస్తున్నారు. ప్రపంచంలో ఇంతటి భాషా వైవిధ్యం కలిగిన ప్రదేశం మరొకటి లేదు.
- నగరం మూలాలు... 1626తో లభ్యమవుతున్నాయి. డచ్ రిపబ్లిక్ ఈ ప్రదేశానికి న్యూ అమ్‌స్టర్‌డామ్‌గా నామకరణం చేసి, వ్యాపార కేంద్రంగా ఉపయోగించింది. 1664లో బ్రిటిష్ వాళ్లు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి ఇంగ్లండ్ రాజు రెండవ చార్లెస్ ఈ ప్రదేశాన్ని తన సోదరుడు 'డ్యూక్ ఆఫ్ యార్క్'కు ధారాదత్తం చేస్తూ, అమ్‌స్టర్‌డామ్ పేరును న్యూయార్క్‌గా మార్చాడు.
- 1785 నుంచి 1790 వరకు న్యూయార్క్ నగరం యునైటెడ్ స్టేట్స్‌కు రాజధాని. అప్పటివరకు దేశంలో అతి పెద్ద అంతస్థులు కల నగరం. ఆకాశాన్ని అందుకునే భవనాలు ఇక్కడెక్కువ.

# ఆదిత్యారాధన - ఆదిత్య హృదయం పఠించడం ఎల్లరకూ శ్రేయస్కరం!

## - అరసవల్లిలో ఆదిత్యాలయం ఉన్నట్టుగానే, గరివిడిలో సూర్యోపాసనం, యాగయజ్ఞాలు చేసే సూర్యసదనం ఉన్నవి! -

ఆదిత్య భగవానుడు సూర్యనారాయణమూర్తి (సూర్యుడు) ఆరోగ్య ప్రసాదించే ప్రత్యక్ష దైవం. ప్రతీ ఉదయమూ ఆయనకు నమస్కరించడం శుభకరం.

రావణ సంహార నిమిత్తార్ధం లంకకు వెళ్ళేముందు, అగస్త్య మహర్షి సలహాతో శ్రీరామచంద్రుడు, ఆదిత్య హృదయం స్తుతించి లంకకు తన పరివారంతో వెళ్ళి రావణ సంహారం కావించి, జానకి చెరను విడిపించి తనతో తీసుకుని తిరిగి రాగలిగాడు.

సూర్యనారాయణునికి యివ్వడమే తక్క పుచ్చుకోవడమెరుగని పిచ్చి మారాజు. యుగయుగాలుగా జగజగాలతోనూ జీవరాశికి సూర్యభగవానుడు అనంతమైన శక్తినీ, అనంతుని కాన్తినీ ప్రతిఫలం కోరకుండా యిస్తున్న ప్రత్యక్ష దైవం. సప్తాశ్వరధారూఢం అని ప్రత్యక్ష నారాయణుడైన సూర్యనారాయణుడినే అంటాం. ఆయన ఏడుగుర్రాల రధమ్మీద ఉదయమే జగాల్న వెల్తురు ఉసురు పెంపు చేయడానికి వస్తాడు. రధసప్తమి ఆయనకు అత్యంత ప్రియమైన పర్వదినం. ఆరోజు ప్రభాతమున శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లిలోనూ, ఒరిస్సాలోని కోణార్క ఆలయంలోనూ అంతరాలయంలోగల సూర్యభగవానుని పాదాలను సూర్యకిరణాలు స్పృశిస్తాయంటారు.

కోణార్కలో సూర్యనారాయణమూర్తి ఆలయాన్ని గాంగ వంశీయుడైన మొదటి నరసింహదేవుడనే రాజు నిర్మించాడు. ఇక్కడ సూర్యునిదీ, సముద్రునిదీ ప్రేయసీ ప్రియుల బంధం అంటారు. ఎక్కడున్నా, ఎన్ని రాచపనులున్నా సూర్యభగవానుడు పొద్దువాలేసరికి రోజ్ (గులాబీ) పౌడర్ పూసుకుంటూ, సోకుల్ని చేసుకుని ఎర్రగా, బుర్రగా, కాంతిపుంజంలా వచ్చి సముద్రం ఒడిలో వాలిపోతాడని కవులంటారు.

'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' అనేది అందువల్లనే! 'సూర్య ఆత్మాజగతి స్తస్థుపచ్చ' అన్నారంటే సర్వప్రాణులకూ సూర్యుడే ఆత్మ. వైదిక వాఙ్మయంలో సూర్యోపాసన, సూర్యనమస్కారం అర్ఘ్య ప్రదానం త్రికాలములు అవశ్యకం అని చెప్పారు.

**సప్త సప్తి వహ ప్రీత, సప్తలోక ప్రదీపన ।**
**సప్తమీ సహితోదేవ! గృహాణార్ఘ్యం దివాకరః ॥**

– అన్నారంటే రధసప్తమి నాటి 'సప్త'కి సప్త సంఖ్యాత్మకమైన అశ్వ వాహనాన్నధిష్టించి, సప్తలోకాలనూ ప్రకాశింపచేసే ఓ దివాకరా! నేనిచ్చే అర్ఘ్యమును స్వీకరించుమని ప్రార్థిస్తే సూర్యశక్తివలన ఆత్మశక్తి, నేత్రశక్తి, హృదయ శక్తి, సర్వశక్తులూ పెరుగుతాయ్. ఉదయం లేచిన తరువాత ఉదయించే సూర్యునికి నమస్కారం చేసి, కొంతసేపు ఆ సూర్యకిరణాలు శరీరాన్ని స్పృశించేటట్టు కూర్చోమంటారు. దానివలన విటమిన్ 'డి' కారణంగా ఎముకలు బలిష్టమవుతాయ్. ధారుఢ్యం పెరుగుతుంది.

సూర్యభగవానుడిచ్చేవాడే గాని, ఇవి యివ్వమని అడిగేవాడు కాదు. అందరినీ సమంగా చూచే సమవర్తనుడాయన. సమ దర్శి. రథసప్తమినాడు కొందరు స్త్రీలు సప్తాశ్వర రథారూఢునిలానే ముగ్గులు గీసి, ఆ ముగ్గు లపై చిక్కుడు కాయలతో చేసిన రధాన్ని ఉంచి, అందు తమలపాకు నుంచి సూర్య బింబ ప్రతిమను గీసి, ఎర్రని పూలు, ఎర్రని అక్షతలతో పూజించి, పాయసమును చేసి జిల్లేడు ఆకులపై పెట్టే ప్రసాదంగా గ్రహించాలి.

సూర్యారాధనం కొన్ని వేల సంవత్సరాల్నుంచీ ఉన్నది. శ్రీరామచంద్రుడు రావణ సంహారార్థం బయల్దేరే ముందు 'ఆదిత్య హృదయం' పఠించే పయనమయ్యారు. శ్రీకృష్ణునికి ముఖ్యత్వమిస్తూ విరాట్మూర్తి విషయాలు సూర్యునికి బోధించానన్నాడు. ఓంకార స్ఫోటనంలో జగజ్జేయంగా విభ్రాజిల్లిన తొలి కాంతి పుంజం సూర్య భగవానునిదే



సద్గురు కృష్ణయాజీ, వేమకోటి సూర్యనారాయణశర్మ

**సూర్యాద్భవంతి భూతాని, సూర్యేణ పాలితానిచ**
**సూర్యేలయం ప్రాప్నువంతియ సూర్యః సోహమేవచ**

సూర్యుని కారణంగానే ప్రాణికోటి జీవిస్తున్నది. పంచభూతాలకు చైతన్యం కలుగుతున్నది. సాగరంలోని నీరు ఆవిరియై, ఆకాశమున మేఘాలుగా మారి వర్షం కురిసినందుననే పుడమి పులకరించి, పంటలను పండిస్తూ, ఆహార కొరత లేకుండా చేస్తున్నది. జీవరాశి దాహార్తితో బాధపడకుండా జీవరాశులు ఉంటున్నాయంటే – సూర్యుడనై ఉన్నానని నారాయణుడు చెబుతున్నాడు.

ఉత్తరాంధ్రలో అరసవల్లి క్షేత్రానికన్నివిధాలా వెన్నుదన్నుగా ఉంటూ, గరివిడిలో సూర్యసదనం నెలకొల్పి సూర్యయాగములూ, సూర్యకల్యాణమూ, సూర్య సంబంధమైన సమస్త దేవ కార్యములను చేస్తూన్న సద్గురు **వేమకోటి కృష్ణయాజీ** నిరంతర సూర్యోపాసకుడు, ఆయన కుమారులకు సూర్యనారాయణ నామకరణమే చేసారు. భారతదేశంలో ఇంతటి మహోన్నతంగా సూర్యారాధనం చేస్తున్నవారు నా కలానికి దొరకలేదు. సూర్యభగవానుని వలె జీవకోటికి ధనమన సహాయములు చేస్తూ, ఆర్ష ధర్మాభివృద్ధికీ, ఆయుర్వేద శాస్త్రోన్నతికీ ప్రతిఫలాపేక్ష లేని సహాయం చేస్తూ, పండితులను పోషిస్తూ, కళాకారులను ఆదుకుంటూన్న తండ్రీ కొడుకులను రధసప్తమి సందర్భములో అభినందిస్తూన్నాం. కోస్తాంధ్రలో వెలసిన అపర సూర్యనారాయణులుగా కృష్ణయాజీయని భావిస్తున్నాం. కృష్ణయాజీకి యివ్వడమే తెలుసుననడంలో అతిశయోక్తి కాదు. ●

SOUTHERN TRAVELS
happy holidaying...
SOUTHERN TRAVELS PVT.LTD.
(Recognised by Ministry of Tourism. Govt. of India) Since 1970
18/2, Arya Samaj Road, Karol Bagh, New Delhi - 05.
Tel. : 011-4353 2800 (100 Lines), 2875 3466
Fax : 011-2875 7308, 4250 2090
e-mail : info@southerntravels.in
Winners of National Award as "The Best Domestic Tour Operator" 2 Times in a row securing 1st Position in India from the Ministry of Tourisim, Govt. of India
Book online through www.southerntravels.com
Our Tour Packages, Hotels in India & Domestic / Flight Tickets
Chennai : 044-2538 5253 Mumbai : 022 - 2501 0027
Vijayawada : 0866 - 257 6624 Vizag : 0891 - 274 5565
Bangalore : 080 - 2226 2633, Hyderabad : 040 - 2331 8866

క్రొత్త ఢిల్లీలో ఆంధ్రా హోటల్ HOTEL SOUTHERN
ఢిల్లీలోని తెలుగువారి ఏకైక వాణిజ్య సంస్థ
HOTEL SOUTHERN
style. comfort. enjoy.
ఆధునిక ప్రయాణ సౌకర్యాలతో, ఉత్తర భారత యాత్రలు నిర్వహిస్తూ ప్రతి తెలుగింటా సుపరిచితమైన సదరన్ ట్రావెల్స్ వారి అనుబంధ సంస్థ "HOTEL SOUTHERN, Karol Bagh, New Delhi లోని ప్రముఖ వ్యాపార కూడలిలో, అధునాతన సౌకర్యములతో నిర్మింపబడి, 100 రూములు, Business Centre, విజయవాడ / అమరావతి రెస్టారెంట్లు గల హోటల్ సదరన్‌లో విడిది చేయగలరు.
Free pick up from Nizamuddin / New Delhi Railway Stations and Domestic Airport

## ఎంత ధనమున్నా అరవై వయసు వరకే అనుభవించగలవు! నీకు అరవై నిండాక అర్ధాంగి పోయిందా! నీవు జీవచ్ఛవమే!!

సంపాదించిన డబ్బు ఓ వయసు వరకే ఆనందాన్నిస్తుంది. వయసు అంచుల అరవై దాటేసరికి జీవన కంచెకు భద్రత ఉండదు. ఆప్యాయత, ఆత్మీయతలు అరసున్నా ప్రమాణానికి దిగిపోతుంది. డబ్బు నీకు ఆనందాన్నివ్వదు సరికదా, జన్మశత్రువుగా మారుతుంది. అనారోగ్యం, అశాంతి గల మనసు, కాలక్షేప లేమి, ఇలా ఎన్ని తికమకలు నిన్ను పెడతాయో అందరికీ అనుభవమే! అర్ధశరీరియైన అర్ధాంగిపోయిందా – జీవితం కుక్కలు చింపిన విస్తరేయవుతుంది. ఎదిగిన పిల్లలు విడిపోతారు. చుట్టుప్రక్కల ఉండరు. పిలుపుకు అందరు. ప్రేమను పంచాలనుకున్నా వారికి అవకాశం ఉండదు. కత్రాటకు కట్టేసిన 'బర్రె'లాంటి స్థితి. పుర్రెలోని కండరాలు స్వేచ్ఛ కోసం తపిస్తాయ్. శరీరం నుంచీ స్వేదం బయటకు పోవడానికి శరీరంలోపల నీళ్ళు కూడా ఉండవు. ఇదివరకు జీవన ప్రపంచం చుట్టుప్రక్కల తిరిగేది. కూతవేటు దూరంలో కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, బావమరుదులు, మరదళ్ళు ఉండేవారు. బంధుబలగం బలాన్ని పెంచేది. ఇప్పుడు ప్రపంచం విస్తృతమయింది. ఉద్యోగ భృతిల కోసం సాగరాలు దాటి వెళ్ళిపోతున్నారు. ఎలెక్ట్రానిక్ పరిజ్ఞానం వచ్చిన తరువాత కార్డుముక్క వ్రాసే సమయం ఉండడం లేదు. ఆ తరం వారికిది ఆత్మవిచారకారకమైంది. ప్రేమానుభూతులు దొరకని పరిస్థితులేర్పడ్డాయ్. ఈ 80 సంవత్సరాల వయసే చాలు వంద సంవత్సరాలు జీవించమని ఆశీర్వదించ కండని గాంధీజీతో అన్నారు, ఠాగూర్ మహాశయులు.

## నువ్వుల పువ్వులు చెలరేగిన నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు

తెలుగు వంటకాలు ఫెళఫెళ్లాడిపోయాయి. పూటకు కోటి రూపాయలట.


ఉత్తరాది వంటవాళ్ళట – బొబ్బట్లను పీక్కు పీక్కుని తినాల్సి వచ్చిందట. ఓ పన్ను ఊడిందట.

పోన్లే నీకది దక్కి బొక్కావ్. నా కిట్టులో ఫుడ్ కూపన్లు లేనే లేవు.

ఏడ్సినట్టే వుంది. కూపన్లుండిన నాకు భోజనం అయిపోయిందన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలంటే ఇంతేరా!








మహనీయుడా! ప్రపంచ తెలుగు మహాసభలో నీ సత్కారం యెలా జరిగిందిరా?

బిలబిలలాడుతూ సినిమావాళ్లొచ్చేసరికి మా ప్రక్కకు చూచినవారే లేరురా!

ఔరా! నీకెలా జరిగిందిరా?

ఇస్తామన్న చెక్కు బుక్కులో చెక్కులయిపోయాయ్ అన్నారురా!

***ఏది ఏమయినా తిరుపతి వేంకటేశ్వరస్వామి చలువో, కిరణ్‌కుమార్ రెడ్డి సంకల్పమో పుట్టలు పుట్టలుగా జనం వచ్చారు. పండితులు పొగడి పొగిడేసారు.***

## కర్ణాటక సంగీతంలో 'మాండలిన్' శ్రీనివాస్ విన్యాసం




చెన్నయ్‌కి చెందిన శ్రీనివాస్ బంధం మాండలిన్ వాయిద్య విన్యాసం అమోఘమంటూ తిరుపతి సభల్లో అందరినీ అలరించింది, ప్రశంసలు పొందింది. తిరుపతిలోని త్యాగరాజ మంటపంలో త్యాగరాజ స్వామి సంగీత నాట్యోత్సవాల సందర్భంగా భీమాస్ రఘు ప్రతీ సంవత్సరమూ పదిరోజుల పాటు సంగీతోత్సవాలు జరిపిస్తున్నారు. శ్రోతగా వెళ్ళి ఆనందిస్తుంటాను. బంగాళా రాగంలో గిరిరాజ సుతా అంటూ ప్రారంభించి వాగధీశ్వరీలో పరమాత్ముడు వెలిగే, సబ్బరీ రాగంలో వరాలందుకొమ్మని లాంటి త్యాగరాజ కీర్తలను ఆయన మాండలిన్‌పై అలవోకగా పలికించి మెప్పించారు. వీరికి వయోలిన్ – వీవీ శ్రీనివాసరావు, మృదంగం – ఎం.స్వామినాథన్, ఘటం – తిరుచ్చి మురళి సహకారం అందించారు.

మాండలిన్ శ్రీనివాస్ మా పాలకొల్లువాడు. పాలకొల్లులో మా ఇంటికి ఎదురుగా ఉండే సంగీత సద్గురువు రుద్రరాజు సుబ్బరాజు గారి శిష్యుడు. ఆయన మద్రాసు వడపళనిలోని కుమరన్ కాలనీలో ఇల్లు కట్టుకుని, ప్రక్కనే శ్రీనివాస్ క్కూడా స్థలం యిచ్చి, మాండలిన్‌పై కర్ణాటక సంగీతం నేర్పారు. మాండలిన్ వాయిద్యం కర్ణాటక సంగీతానికి అనువైనది కాదు. శ్రీనివాస్ వేళ్ళు మాండలిన్ తీగలపై, వీణాతంతుల్లా మ్రోగుతూంటే ప్రేక్షకులు పులకరించిపోతూంటారు. రుద్రరాజు సుబ్బారాజు గారు ప॥గో॥జిల్లా పోడూరు వాస్తవ్యులు. కొన్నేళ్ళ క్రితం చెన్నయ్ వచ్చి సంగీత విద్వాన్ చెంబై వైద్యనాథ భాగవతార్ వద్ద సంగీత విద్య నభ్యసించారు. పాలకొల్లు తిరిగి వచ్చాక ఎందరినో సంగీత విద్వాంసులుగా తీర్చిదిద్దారు. మాండలిన్‌లో మాత్రం శ్రీనివాస్‌కు ప్రత్యేక శిక్షణ యివ్వడంతో శ్రీనివాస్ సుప్రసిద్ధ మాండలిన్ శ్రీనివాస్‌గా ప్రసిద్ధినొందారు. దేశంలోనే కాదు అంతర్జాతీయంగా మాండలిన్‌కు ప్రత్యేక విలువను కొనితెచ్చారు. శ్రీనివాసన్ తమ్ముళ్ళే గాకుండా ఎంతోమంది శిష్యరేణువులను తయారుచేసి మాండలిన్ వాయిద్యానికే ఒక ప్రత్యేకతను తీసుకుని వచ్చినవాడు శ్రీనివాస్. ఆయన కచ్చేరీలకు తండ్రి తోడుగా నీడగా ఉంటూ సహకారం అందిస్తూంటారు. ఆ తండ్రీ కొడుకుల అనుబంధం చూస్తూంటే స్వామిమలై క్షేత్రంలోని పరమశివుడూ, సుబ్రహ్మణ్యస్వామి గుర్తుకువస్తారు. పెద్దల పట్ల విధేయభావం కల శ్రీనివాస్ ఎదిగినకొద్దీ ఒదిగినట్టు ఒద్దికగా ఉంటూ, దినదిన ప్రశంసలనందుకోవడం నాకెంతో సంతోషంగా ఉన్నది. శ్రీనివాస్ పాల్గొనని త్యాగరాజసభలే ఉండవని నా అభిప్రాయం!

# మాతృభాషా సేవలో పులకింత!
# 'ఈనాడు' పత్రిక గిలకరించిన పాలపుంత!

## 'తెలుగు' చక్కదనం వర్ణించతరమా...!

గోటేటి శ్రీరామారావు




'తెలుగే' ఆయన పంచప్రాణాలు. అందుకే ఇంటినిండా తెలుగు గ్రంథాలు. విదేశాల్లోనూ తెలుగు అక్షరాలను చూసి ఉప్పొంగిపోయారాయన. భాషా సేవలో ఆయన 'ప్రముఖాంధ్ర' ప్రవాసంలోనూ సేవలందిస్తోంది. అందుకే ఎంతో ప్రాశస్త్యం ఉన్న తెలుగుభాషను అభివర్ణించడం సాధ్యమా అంటారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, ఎనిమిది పదులు నిండిన ప్రముఖ పాత్రికేయులు, 'ప్రముఖాంధ్ర' వ్యవస్థాపకులు గోటేటి శ్రీరామారావు. తెలుగు భాషకు సంబంధించి... ప్రవాసంలోనూ అమలవుతున్న తీరు గురించి ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. నేటి తెలుగుపై ఆయన ఆ నాలుగు మాటలూ విందాం...

### ప్రముఖాంధ్ర ప్రారంభం...

1993 ప్రాంతంలో చెన్నైలో జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రథమ సదస్సు సందర్భంగా 'ప్రముఖాంధ్ర'ను ప్రవేశపెట్టటం జరిగింది. మూడు వేల కాపీలతో ప్రారంభమైన ముద్రణ విస్తరించి త్రిదండి చిన్నజీయర్‌స్వామి చరిత్రకు సంబంధించి రాసిన ప్రత్యేక వ్యాసాలతో కూడిన అయిదువేలు ప్రతులు అమెరికాకు వెళ్లాయి. తదనంతరం ఆన్ లైన్‌లో ప్రారంభించిన అనంతరం బాగా ప్రాచుర్యం పొందింది. తెలుగు ప్రముఖులు వీఎల్ దత్, ఎల్వీ రామయ్య, బీఎస్సార్ కృష్ణ, ఎన్నార్ చందూర్, ఇంటూరి వెంకటేశ్వరరావు, అయ్యగారి విశ్వేశ్వరరావు, వేదం వెంకటరాయ శాస్త్రి వంటి పలువురు ప్రముఖులు చెన్నై మహానగరంలో ప్రముఖాంధ్ర ప్రచురించడంపై అప్పట్లో ప్రశంసించారు.

### రాజబాబు ప్రోత్సాహం

వేలాది కాపీలతో ప్రచురించ తలపెట్టిన ఈ పత్రికకు నాటి మేటి సినీ హాస్యనటుడు రాజబాబు ప్రెస్ స్థాపనకు అందించిన ఆర్థిక ప్రోత్సాహం చిరస్మరణీయం. తద్వారా తన పేరు, పత్రిక పేర్లు మరింత పెరిగి చెన్నైలోని దాదాపు తెలుగువారందరికీ పరిచయమైంది. చెన్నై మహానగరంతో పాటు తమిళనాడులోని పలు జిల్లాల్లో కూడా తెలుగు అనాది కాలంనుంచి కొనసాగుతోంది. రెండు దశాబ్దాల కిందట చెన్నై నగరంతోపాటు పలు జిల్లాలలో కూడా తెలుగు పాఠశాలలు కూడా నిర్విఘ్నంగా కొనసాగాయి.

### మలేషియా తెలుగువారు మార్గదర్శకం...

మలేషియాలోని రవాంగ్ రాష్ట్రంలో ఓ వీధిలోని దుకాణాలపై గుండ్రటి తెలుగు అక్షరాలతో కూడిన బోర్డులు దర్శనమివ్వడం నన్ను నివ్వెరపరిచింది. మలేషియాలో భారతీయులంటే తమిళులే అన్న భావం ప్రభుత్వ వర్గాలలోను ప్రజలలోనూ ఉండేది. అయితే తెలుగుసంఘాలు సంయుక్త కృషితో ప్రైవేటు పాఠశాలల ద్వారా మన తెలుగు భాషను వ్యాపింప చేసారు. ఇక్కడినుంచి భారీ సంఖ్యలో తెలుగు పత్రికలు నిత్యం మలేషియాకు వెళ్తున్నాయి. ప్రముఖాంధ్ర మాసపత్రిక 500 కాపీలు పైచిలుకు ఆ దేశానికి పంపుతున్నాము. మలేషియాలో తెలుగును ప్రోత్సహిస్తున్న విధానాన్ని ప్రతి ఒక్కరూ మార్గదర్శకంగా తీసుకోవాలి. తెలుగు కాని ప్రాంతంలో ఇంతటి విశిష్టత సాధించడానికి ప్రధాన కారణం తెలుగు సంఘాల సంయుక్త కృషే.



గ్రంథమే ఆయన సొంతం



గోటేటి అందుకున్న అవార్డులు, పురస్కారాలు




నేటి ప్రముఖాంధ్ర

### విద్యార్థులు ఎక్కువమంది ఉంటే...

ఫ్రెంచి వంటి పలు భాషలతో కళకళలాడుతున్న పాఠశాలల్లో తెలుగు అభ్యసించే పిల్లలు అధికంగా ఉంటే ప్రత్యేక తరగతులు తప్పకుండా ఏర్పాటుచేస్తారు. చెన్నైలో ప్రస్తుతం తెలుగు పఠనం తగ్గడంతో ప్రయివేటు పాఠశాలల్లోని తరగతులు అదృశ్యమైపోతున్నాయి. తెలుగు శ్రవణపరంగా పెరుగుతుండటం గుర్తించాలి. ఎంతో విశిష్టత సంతరించుకున్న తేట తెలుగు చంద్రగిరి రాజుల ప్రోత్సాహంతో చెన్నైలో విస్తరించింది. అయితే ఇటీవల కాలంలో పఠనాపరంగా తగ్గిపోవడాన్ని ప్రతి ఒక్క తెలుగువారు గమనించాలి. తెలుగు సంఘాలు నిర్విరామ సమైక్యకృషితో తల్లిదండ్రులను ప్రోత్సహించడం ద్వారా పఠనాపరంగా ప్రాణం పోయడం సాధ్యమవుతుంది. ఆ కాలంలో కేసరి ఉన్నత పాఠశాలలో తెలుగును అభ్యసించినవారు మహోన్నత స్థానాలకు చేరుకున్నారనేది నగ్న సత్యం. తెలుగు భాషపై ఉన్న అపారమైన అభిమానంతో ప్రారంభించిన ప్రముఖాంధ్ర పలువురు ప్రముఖుల ప్రశంసలు పొందింది బహుముఖ ప్రజ్ఞాశాలి గోటేటికి సన్మానాలు, పురస్కారాలు, అవార్డులు అందించాయ్. ప్రస్తుతం భాగవతం వంటి పలు పుస్తకాల రూపకల్పనలో నిమగ్నమై ఉన్నాను' అంటున్నారు గోటేటి శ్రీరామారావు.

– 'ఈనాడు' సౌజన్యంతో